క్లుప్తంగా

క్రైస్తవులపై దాడులు అరికట్టండి



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కర్నూలు (టౌన్): మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు అరికట్టాలని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి అధ్యక్షులు ప్రభుదాస్ డిమాండ్ చేశారు. శనివారం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో కొందరు దుండగులు క్రైస్తవులపై దాడులు చేయడం, హింసాత్మక ఘటనలకు పాల్పడటం, చర్చిలను తగలబెట్టడం, భయ భ్రాంతులకు గురిచేయడం అమానుషమన్నారు. కేంద్రం స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కోల్స్ చర్చి సంఘం నాయకులు ఆర్ అనిల్ నాథ్ దానియేలు, రెవరెండ్ పాస్కల్ పాస్టర్, ఆర్.అనిల్‌కుమార్ సామేల్, జీవన్ రావు, వివిధ సంఘాలకు చెందిన పాస్టర్లు, మహిళలు పాల్గొన్నారు.

గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయాలి

కర్నూలు(రూరల్): ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు పెరిగిన గ్యాస్ ధరల దృష్ట్యా ప్రభుత్వమే ఉచితంగా గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

వెంకటరమణ కాలనీలో అగ్ని ప్రమాదం

కర్నూలు (రూరల్): నగరంలోని వెంకటరమణ కాలనీలో వెంకటేశ్వర స్వామి ఆలయం లైన్‌లో శనివారం గుజిరీ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. షాప్ నిర్వాహకుడు జబ్బార్ గుర్తించి వెంటనే అగ్ని మాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించాడు. జిల్లా అగ్నిమాపక శాఖాధికారి అవినాష్ జయసింహ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో షెడ్, సామగ్రి పూర్తిగా కాలిపోయి దాదాపు రూ.4.50 లక్షల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

బీటీఆర్ నగర్‌లో షార్ట్ సర్క్యూట్



కాలిపోయిన వస్తువులు

కర్నూలు(రూరల్): స్థానిక బీటీఆర్ నగర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు 40 ఇళ్లల్లో ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిడ్జ్‌లు కాలిపోయాయి. ఈ ఘటనలో దాదాపు రూ.20 లక్షల నష్టం జరిగినట్లు బాధితులు వాపోతున్నారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో రేపు మహా ధర్నా

కర్నూలు(రూరల్): ఇందిరమ్మ, టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలనే డిమాండ్‌తో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈనెల 10న మహా ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు ధర్నా

కర్నూలు(రూరల్): గంజిహళ్లి అత్యాచార ఘటనలోని నిందితులను అరెస్టు చేయాలని ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయం ఎదుట ఈనెల 10వ తేదీన ధర్నా నిర్వహించనున్నట్లు ప్రజాసంఘాల నాయకులు సుజాత, ఆనంద్ బాబు, నగేష్‌లు శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ఉపాధి పథకం పేదలకు వరం



పంచలింగాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వెంకటరాముడు

కర్నూలు (న్యూటౌన్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేద ప్రజలకు వరంలాంటిదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు అన్నారు. శనివారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి చట్టం ఉండడంతో కరువు కాలంలో పేదలకు నాలుగు మెతుకులు అన్నం దొరుకుతుందని అన్నారు. 100 రోజులు పూర్తయిన కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కార్యదర్శి రాజు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సీహెచ్ మద్దయ్య దంపతులు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వైఎస్సార్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సుభాస్‌చంద్రబోస్



రోజావీధిలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వృద్ధులు

మహానేతకు ఘన నివాళి

మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు శనివారం వాడవాలా జరిగాయి. ఆయన విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పలు పాలాభిషేకాలు నిర్వహించి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

● వాడవాడలా వైఎస్సార్ జయంతి వేడుకలు



వైఎస్ఆర్ సర్కిల్ వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్) : మాజీ ఎంపీ బుట్టా రేణుక స్థానిక జొహరాపురం రోడ్డులోని తన కార్యాలయంలో వైఎస్సార్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి విద్యార్థులు, కార్యకర్తకు పంచిపెట్టారు. అనంతరం పేద విద్యార్థినులకు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లికా బేగం, నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసు లు, బుట్టా ఫౌండేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ సర్కిల్‌లోని మహానేత విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకురాలు విజయమనోహరి పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): వైఎస్సార్‌సీపీ సీనియర్ నా యకుడు కటారి సురేష్ ఆధ్వర్యంలో కర్నూలు సర్వజన ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రారంభించి రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో ప్రశాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ జయంతిని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎసార్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మద్దయ్య దంపతులు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ మతవి పెద్దక్క పాల్గొన్నారు. రోజావీధిలో జరిగిన వేడుకల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా సంఘం నగర అధ్యక్షురాలు మీసాల సుమలత, వృద్ధులు గోరంట్లమ్మ, సుంకులమ్మ, కర్రెమ్మ, శేషమ్మ, గోవిందమ్మ, నారాయణమ్మ తదితరులు వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్నూలు(రూరల్):కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకలను డీసీసీ అధ్యక్షుడు సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు తెర్నెకల్ సురేందర్‌రెడ్డి సీతారామనగర్‌లోని తన కార్యాలయం వద్ద వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించుకున్నారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మునెమ్మ, నాయకులు తౌఫక్, మల్లికార్జున, భాస్కర్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(లీగల్): స్థానిక వైఎస్సార్ కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ లీగల్ సెల్ నాయకులు జిల్లా అధ్యక్షులు పి.సువర్ణారెడ్డి, కర్నాటి పుల్లారెడ్డి, మిరపకాయల ప్రభాకర్, రాజేష్,నారాయణ రెడ్డి,ఎం.శ్రీనివాసరెడ్డి, వై.ప్రకాష్‌రెడ్డి, సి.వెంకటరెడ్డి, తిరుపతయ్య తదితరులు నివాళులర్పించారు.



విద్యార్థినులకు చెక్కులు అందించిన మాజీ ఎంపీ బుట్టా రేణుక



కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకుడు తెర్నెకల్ సురేందర్‌రెడ్డి



వైఎస్సార్ ఫ్లెక్సీని ఆటోకు కట్టుకుని వైఎస్సార్ మీద తన అభిమానాన్ని చాటుకున్న ఆటోడ్రైవర్ మద్దిలేటి

సంక్షేమ పథకాల సృష్టికర్త వైఎస్సార్

కల్లూరు: సంక్షేమ పథకాల సృష్టికర్త వైఎస్సార్ అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శరీన్ నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి కాటసాని పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలతో సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అణగారిన వర్గాల అభివృద్ధి కోసం మహానేత ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, జయరాముడు, చిట్టెమ్మ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మిరెడ్డి, కల్లూరు జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, అర్బన్ వార్డుల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు గోవర్ధన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలచంద్రారెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి,నాగమద్దిలేటి,తిరుమలేష్‌గౌడ్,హుస్సేన్ ఆలం , యూనస్ బాషా, శివ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పట్టాలు అందుకున్న విద్యార్థులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో శనివారం సెకెండ్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ సాయి గోపాల్, సీఎస్ఐఆర్ సైంటిస్టు డాక్టర్ కె.సురేష్‌బాబు హాజరై ప్రసంగించారు. ఫార్మసీ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. అనంతరం 2019–23 బ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆ తరువాత గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ స్టెల్లా సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జే రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె సురేష్, అకడమిక్ డీన్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యం

● ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



టిఫిన్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ప్రతి పేద కుటుంబం ఆర్థికగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన మాజీ ఎంపీ బుట్టా రేణుకతో కలిసి స్థానిక 12వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాధాకృష్ణ టాకీస్, డబరా వీధి ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేసి, ఆ పథకాల సొమ్మును సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన సంక్షేమ పథకాలు అమలుకు అర్హతే ప్రమాణికమని, వీటిని పొందేందుకు ఎవరి సిఫార్సులు అవసరం లేదని చెప్పారు. ఎంపికైన లబ్ధిదారుల ఖాతాలోకి నేరుగా నగదు జమ చేస్తుండడంతో ఎలాంటి అవినీతికి తావు లేదని చెప్పారు. పథకాల కోసం వలంటీరు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, లేదా సమీపంలోని సచివాలయాల్లో ఈ సేవలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు నవీన్, హనీఫ్, మహబూబ్, షేక్షా, దావూద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలు తనిఖీ చేసిన డీఈఓ

సి.బెళగల్: స్థానిక, పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం డీఈఓ రంగారెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులు తీసుకున్న జేవీకే కిట్ల బయోమెట్రిక్ అథెంటికేషన్ పెండింగ్‌లో ఉండటంతో ఆయన ప్రత్యేక క్యాంప్‌లను నిర్వహించి పూర్తి అయ్యేలా చూడాలని మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను ఆదేశించారు. హెచ్ఎం రమా, ఉపాధ్యాయులతో చర్చించారు. డీఈఓ వెంట ఎంఈఓ -2 ఆదాముబాషా, సీఆర్పీలు ఉన్నారు.



పోలకల్ జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

వినియోగదారులకు ఊరట

● కర్నూలు రైతు బజార్లలో కిలో రూ.50 ప్రకారం టమాట పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వినియోగదారులకు సబ్సిడీపై టమాట పంపిణీ చేస్తూ ప్రభుత్వం ఉపశమనం కలిగిస్తోంది. టమటా ధరలు మండుతున్న నేపథ్యంలో కిలో రూ.50 ప్రకారం పంపిణీ చేస్తుండటంతో వినియోగదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. శనివారం కూడా సబ్సిడీపై టమాట పంపిణీ చేశారు. మార్కెటింగ్ శాఖ అధికారులు మదనపల్లి నుంచి 4 టన్నుల టమాట తీసుకొచ్చారు. కర్నూలులోని సీ.క్యాంపు, అమీన్ అబ్బాస్‌నగర్, కొత్తపేట రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు పెట్టి వాటిని కిలో రూ.50 ప్రకారం పంపిణీ చేశారు. బయట రూ.100 నుంచి రూ.120 ఆపైనే ధరలకు అమ్ముతుండటంతో సబ్సిడీ టమాట కోసం వినియోగదారులు పోటెత్తారు. ఎక్కువ మందికి లబ్ధి కలిగించాలనే లక్ష్యంతో ఒక్కొక్కరికి కిలో ప్రకారం పంపిణీ చేశారు. సీ.క్యాంపు రైతుబజారులో మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి, ఎస్టేట్ అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ పర్యవేక్షణలో సెక్యూరిటీ సిబ్బంది వినియోగదారులకు టమాట పంపిణీ చేశారు. కర్నూలు నగరంలోని 3 రైతుబజార్ల ద్వారా 4000 మందికి సబ్సిడీపై టమాట పంపిణీ చేశారు.



సీ.క్యాంపు రైతుబజారులో వినియోగదారులకు టమాట పంపిణీ చేస్తున్న దృశ్యం

మహిళకు గాయాలు

నందవరం: జొహరాపురంలో విద్యుత్ స్తంభం విరిగి పడి లలితకు తీవ్ర రక్త గాయాలయ్యా యి. శనివారం ఎంపీయూపీ స్కూల్ పక్కన ఉన్న కాలనీలో నాగిశేషిరెడ్డి ఇంటివద్ద పాత విద్యుత్ స్తంభం ఉంది. దాని తొలగించాలనే ఉద్దేశంతో మూడురోజుల క్రితం కొత్త విద్యుత్ స్తంభాన్ని పాతారు. ఇంటి ముందు ఉన్న పాత విద్యుత్ స్తంభం విరిగి తీగలపై పడటంతో కొత్త స్తంభం విరిగి లలిత తలపైపడింది.దీంతో ఆమెకు తీవ్ర గాయమైంది. చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

మోతాదుకు మించొద్దు

- ● ఎరువుల వినియోగంలో సమతుల్యత అవసరం
- ● భూసార పరీక్షలు తప్పనిసరి
- ● పంట మార్పిడితో అధిక లాభాలు
- ● కర్నూలు ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు (అగ్రికల్చర్): మోతాదుకు మించి ఎరువులు, మందులు వేయరాదని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి (88866 13073) సూచించారు. ఎరువుల వినియోగంలో సమతుల్యత పాటిస్తేనే ఇటు పంటలకు, అటు భూమికీ మంచిదన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాలను బట్టి ఎరువులు వాడలన్నారు. తరచూ పంట మార్పిడి చేయడం వల్ల కూడా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఖరీఫ్ ప్రారంభం సందర్భంగా రైతులకు ఆయన మరిన్ని సూచనలు చేశారు.

రైతులు పాటించాల్సిన సూచనలు

☛ ప్రతి రెండు, మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించి ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలి.

☛రసాయన ఎరువులతో పాటు పశువుల ఎరువు, గొర్రెల,మేకల పెంట ఎరువు,నూనె గింజల చెక్క , పచ్చి ఆకు జీవన ఎరువులు లాంటి సేంద్రియ ఎరువులు ఉపయోగించడం వల్ల భూసారం పెరుగుతుంది.

☛ నత్రజని ఎరువులను నల్లరేగడి నేలలో మూడు దఫాలుగా, తేలిక నేలలో నాలుగు దఫాలుగా వేయాలి.

☛ భాస్వరం ఎరువులు వేసిన రెండు, మూడు రోజుల తర్వాత జింక్ వేసి భూమిలో కలియ దున్నాలి.

☛ మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువును పొగాకు, నిమ్మ,జామ చెట్లు, ద్రాక్ష, మొదలగు పంటలకు వాడకూడదు. వాటికి పొటాషియం సల్ఫేట్ ఎరువులు వాడాలి.

☛ వేరుశనగలో దృఢమైన కాయలు, గింజలలో నూనెశాతం పెరగటానికి ఎకరానికి రెండు వందల కిలోల మెత్తగా పొడి చేసిన జిప్సమ్‌ను పూత సమయంలో నేల పొరల్లో తగినంత తేమ ఉన్నపుడు వేయాలి.

☛ వరిలో ఎరువులు వేసేటపుడు పొలంలో నీరు తీసి బురద పదునులో వేయాలి. ఎరువులు వేసిన 36 నుంచి 48 గంటల తర్వాత నీరు పెట్టాలి. అధిక దిగుబడి నిచ్చే వంగడాలు, సంకరజాతి రకాలు (హైబ్రిడ్) రసాయనిక ఎరువులను బాగా స్పందించి అధిక దిగుబడి ఇస్తాయి.

☛ పంట మార్పిడి విధిగా పాటించాలి. పంట మార్పిడిలో లెగ్యూమ్ జాతి పంటలకు (పప్పు ధాన్యాలు, వేరుశనగ వగైరా) పండించడం వల్ల వాటి వేర్ల బుడిపెల్లో రైజోబియం బ్యాక్టీయం గాలిలోని నత్రజనిని స్థిరీకరించి నేలను సారవంతం చేస్తాయి. దీని వల్ల మనం నత్రజని ఎరువులపై పెట్టే ఖర్చులను కొంత వరకు తగ్గించుకోవచ్చు.

☛ వేర్లు భూమిలో తక్కువ లోతుకు చొచ్చుకుని పోయే పైర్లను వేర్లు ఎక్కువ లోతుకు చొచ్చుకొని పోయే పైర్లతో పంట మార్పిడి చేయడం వల్ల భూమిలోని వివిధ పొరలలో తేమ పోషక పదార్థాలను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు.

☛ అదునులోనే విత్తనం, నాట్లు వేయాలి. డ్రిప్ ద్వారా ఎరువులను వేయడం వల్ల మొక్కల మొదళ్ల వద్దనే పడటం వల్ల ఎరువులు వృథాకావు. పొలంలో సిఫార్సు చేసిన ఎడంలో విత్తుకొని ఎకరాకు తగినన్ని మొక్కలు ఉండేలా జాగ్రత్త వహించాలి.

☛ మెట్ట భూమిలో కాంటూరు సేద్యం చేయాలి. వాలుకు అడ్డంగా దున్ని, అడ్డంగా విత్తి, అంతర కృషి చేయాలి. దీని వల్ల పడిన వర్షం వృథా కాదు.

☛ శాస్త్రీయంగా నత్రజని భాస్వరం, పొటాషియం వినియోగం 4:2:1నిష్పత్తిలో ఉండాలి. మనదేశంలో ఏటా హెక్టారు పొలం నుంచి 13 కిలోల నత్రజని, 11 కిలోల భాస్వరం, 44 కిలోల పొటాషియం మొదలగు పోషక పదార్థాలు మట్టితో పాటు వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నాయి. రైతులు భాస్వర నీటి పరిరక్షణ పద్ధతులు పాటించి వృథాగా పోతున్న పోషక పదార్థాలను కాపాడుకోవాలి.

☛ సేంద్రియ ఎరువులను విరివిగా వాడటం వల్ల నేలలో సూక్ష్మ జీవుల సంఖ్య పెరిగి వాటి చర్యల కారణంగా వెంటనే లభ్యం కాని పోషక పదార్థాలు మొక్కలకు అందుబాటులోకి వస్తాయి. జీవన ఎరువుల ప్రాముఖ్యాన్ని గుర్తించి విరివిగా వాడాలి.

☛ పొలంలో మురుగు నీరు తీసే వీలు లేనప్పుడు, ఎక్కువ లోతుగా నీళ్లు పారుతున్నప్పుడు పైరుకు 2 శాతం ద్రావణం అంటే 20 గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

☛ రసాయనిక ఎరువులను పైరుపై వెదజల్లకుండా మొక్కల మొదళ్ల వద్ద 5 నుంచి 10 సెంటీమీటర్ల దూరంలో వేసి మట్టిలో కలిసిపోయేలా కలియ పెట్టించాలి.

☛ నేలలు ఆమ్లాధారమైనప్పుడు, క్షార నేలలైనప్పుడు ఈ సమస్యను సవరించిన తర్వాతనే రసాయనిక ఎరువులు వాడటం ఉత్తమం. జింకు లోప నివారణకు 3 పంటలకోసారి ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్ ఎరువు ఆఖరి దుక్కిలో వేయాలి.

☛ పాస్ఫేట్, పొటాష్ కాంప్లెక్స్ ఎరువులు ధరలు పెరిగిన కారణంగా నేడు రైతులు అడ్డూఅదుపు లేకుండా తక్కువ ధరలో లభిస్తున్న యూరియా వాడి పంటలను అధిక చీడపీడలకు గురి చేయడమే గాక పోషక పదార్థాల మధ్య ఉండాల్సిన సమతుల్యాన్ని దెబ్బతిసి నేలను నిస్సారమయ్యేలా చేస్తున్నారు.

☛ పంటలకు ఎక్కువ మోతాదులో కావలసిన నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాలను కాంప్లెక్స్ ఎరువులకంటే సూటి ఎరువులు (యూరియా, సూపర్ పాస్పేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్) రూపంలో వేయడం వల్ల తక్కువ ధరలో పై మూడు పోషక పదార్థాలను మనం పైర్లకు అందించవచ్చు.

డీసీసీబీ ఓల్డ్‌టౌన్ బ్రాంచ్ పునఃప్రారంభం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఓల్డ్ టౌన్ బ్రాంచ్‌ను శనివారం డీసీసీబీ చైర్‌పర్సన్ మహాలక్ష్మి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రాంచ్ మొదటి అంతస్తులో ఉండటంతో ఖాతాదారులు ఇబ్బందులు పడేవారన్నారు. ఖాతాదారుల సౌలభ్యం కోసం గ్రౌండ్ ఫ్లోర్‌కు ఆధునీకరించి బ్రాంచ్ కార్యక్రమాలను మార్పు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ రామాంజనేయులు, పాలకవర్గం సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజావిష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ మహాలక్ష్మి

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు



గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేస్తున్న సీఈఓ రమణ

కర్నూలు(రూరల్): నవాబ్ ఆలఫ్ ఖాన్ స్మారకార్థం రెండు రోజులు నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలు శనివారం ముగిసినట్లు కర్నూలు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసులు తెలిపారు. మొత్తం 8 జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులను క్రీడాశాఖ సీఈఓ రమణ అందజేశారు.